
సాక్షి ఒడిశా

బుధవారం । 25 । సెప్టెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,89,758లు, బంగారం 19 గ్రాముల 350 మిల్లీగ్రాములు వెండి 96 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



భారీగా గంజాయి స్వాధీనం

పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు బొలేరోలో అక్రమంగా తరలిస్తున్న 525 కిలోల గంజాయిని గుణుపూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

- 8లో▸



నదిలో మునిగి వృద్ధురాలి మృతి

నదిలో మునిగి ఒక వృద్ధురాలు మృతి చెందిన ఘటన రాయగడ జిల్లాలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది.

- 8లో▸

న్యూస్‌రీల్

నెయ్యి నాణ్యత తనిఖీ చేస్తాం

● పూరీ కలెక్టర్ సమర్థ వర్మ



భువనేశ్వర్: తిరుమల వేంకటేశ్వర స్వామివారి లడ్డూ ప్రసాదం వివాదం నేపథ్యంలో శ్రీజగన్నాథుని దేవస్థానం శ్రీమందిరం అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. శ్రీమందిరంలో నిత్యం స్వామి నివేదన కోసం పలు వంటకాల్లో శుద్ధ నెయ్యి వినియోగించడం ఆచారంగా కొనసాగుతోంది. మరోవైపు ధూపదీపాదుల సేవలో కూడా నెయ్యి వినియోగిస్తారు. దీంతో ఈ నెయ్యి నాణ్యతపై ఏమాత్రం సందేహం తలెత్తినా తక్షణమే తనిఖీ చేపడతామని పూరీ జిల్లా కలెక్టర్ సమర్థ వర్మ మంగళవారం తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ఒడిశా మిల్క్ ఫెడరేషన్(ఓంఫెడ్) వంటి ప్రముఖ పాడి ఉత్పాదన సంస్థలతో సంప్రదించనున్నట్లు ప్రకటించారు.

ప్రసవ 'వే'దన



డోలీలో గర్భిణిని తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

జయపురం: కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ సమితి జొడాపుట్ పంచాయతీ తెంతిలిపాడు గ్రామానికి చెందిన నిండు గర్భిణిని డోలీలో ఆస్పత్రికి తీసుకెళ్లిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో ఆ గ్రామానికి చెందిన హరి పూజారి భార్య దాలి పూజారికి పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అయితే ఆ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో రోడ్డు వరకు వస్తామని, అక్కడి వరకు గర్భిణిని తీసుకు రావాలని అంబులెన్స్ డ్రైవర్ తెలిపాడు. దీంతో చేసేదేమీ గర్భిణిని డోలీలో కూర్చొనిబెట్టుకొని సుమారు 5కి.మీ వరకు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మోసుకెళ్లారు. అనంతరం అక్కడ నుంచి అంబులెన్స్‌లో బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అచ్చట ఆమె ఒక మగబిడ్డకు జన్మనిచ్చింది. తమ గ్రామానికి రోడ్డు లేకపోవడం వలన పలు ఇబ్బందులు పడుతున్నామని, ఎంతోకాలంగా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతున్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు


● డ్రైవర్ మృత్యువాత



కారుని ఒడ్డుకు తీసుకొస్తున్న అగ్నిమాపక సిబ్బంది

భువనేశ్వర్: కటక్ జిల్లాలో కారు కాలువలోకి దూసుకెళ్లిన ఘటన చోటుచేసుకుంది. దీనిని మంగళవారం ఉదయం బంఫాకుదొ గ్రామస్తులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందజేయడంతో అగ్నిమాపక దళంతో కలిసి ఘటనా స్థలం సందర్శించారు. కాలువలో మునిగిన కారుని ఒడ్డుకు చేర్చి పరిశీలించారు. దీనిలో డ్రైవరు మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడు బంఫాకుదొ గ్రామస్తుడు కన్హా జెనాగా గుర్తించారు. పంచనామా కోసం మృతదేహాన్ని తరలించారు. రాత్రి ఇంటికి చేరాల్సి ఉండగా ఇంటి దగ్గరలో ఈ ఘోరానికి బలై ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. అదుపుతప్పి కారు కాలువలో పడి ఉంటుందని భావిస్తున్నారు. కటక్ సదరు ఠాణా పోలీసులు అసహజ మరణంగా కేసు నమోదు చేశారు.

కాలువలో మృతదేహాలు



కాలువలో తేలుతున్న మృతదేహాలు

భువనేశ్వర్: బొలంగీర్ జిల్లాలోని కాలువలో రెండు మృతదేహాలు తేలుతున్నట్లు స్థానికులు గుర్తించారు. వీటి ఆచూకీ తెలియాల్సి ఉంది. బొలంగీర్ జిల్లా 59వ నంబర్ జాతీయ రహదారి మురిబహాల్ పోలీసు ఠాణా పరిధిలో భొయపాడా గ్రామం ప్రాంతంలో ఈ దృశ్యం తారసపడింది. పోలీసులు ఘటనా స్థలం సందర్శించి విచారణ ప్రారంభించారు.

'నడక'యాతన



బొయిపరిగుడ సమితి రామగిరి పంచాయతీ పూజారిగుడ గ్రామానికి చెందిన మహిళలు ప్రభుత్వం అమలు చేస్తున్న సుభద్ర పథకం అందుకోవడానికి నడకయాతన పడుతున్నారు. వీరంతా పథకానికి అవసరమైన ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్, బ్యాంక్ పాస్‌బుక్‌లతో లింక్ చేసి దరఖాస్తులు సమర్పించేందుకు సుభద్ర కేంద్ర ఉన్నటువంటి రామగిరికి వెళ్లాల్సి ఉంటుంది. వారి గ్రామం నుంచి రవాణా సౌకర్యాలు లేకపోవడంతో ఉదయం 5 గంటలకే నడుచుకొని వెళ్లడం ప్రారంభిస్తున్నారు. ఒకవేళ ఆరోజు పని పూర్తవకపోతే మరలా మరోరోజు సైతం అదే ఇబ్బందులు తప్పడం లేదు.

- జయపురం

ప్రమాదపుటంచున



ఈ దృశ్యం రాయగడ జిల్లాలోని మునిగుడ సమితి అంబొదల ప్రాంతంలో కనిపించింది. అంబొదల బొడొవీధికి చెందిన ప్రజలు అంబొదల గ్రామానికి చేరుకోవాలంటే మధ్యలో ఉన్నటువంటి ట్రైన్ ట్రాక్‌ను దాటుకొని వెళ్లాల్సిన పరిస్థితి. అయితే ఒక్కోసారి గూడ్స్ ట్రైన్లు గంటల తరబడి ట్రాక్‌పై నిలిచిపోతాయి. ఈ సమయంలో గత్యంతరం లేక ఆగి ఉన్న ట్రైన్ కింద నుంచి ప్రజలు రాకపోకలు కొనసాగిస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం సమయం మించిపోతుందని ఇలానే ప్రమాదపుటంచున ప్రయాణాలు చేస్తున్నారు.

- రాయగడ

నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట

● సీఎం మోహన్ చరణ్ మాఝీ



అంతర్జాతీయ ప్రదర్శనలో ప్రతిభ కనబర్చిన బృందంతో సీఎం మోహన్

భువనేశ్వర్:

రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని సీఎం మోహన్ చరణ్ మాఝీ అన్నారు. ఇటీవల ఫ్రాన్స్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థుల బృందాన్ని ఆయన కార్యాలయంలో మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. ఫ్రాన్స్‌లో జరిగిన 47వ ప్రపంచ నైపుణ్యాల పోటీలో ఒడిశా యువకులు దేవ్‌గఢ్‌కు చెందిన అమరేష్ కుమార్ సాహు, గజపతి జిల్లా పర్లాకిమిడికి చెందిన అఖిల్ గేదెల బహుమతులు గెలుచుకున్నారు. రెన్యూవబుల్ ఎనర్జీలో అమరేష్ కుమార్ సాహు కాంస్యం గెలుచుకోగా, వాటర్ టెక్నాలజీలో అఖిల్ గేదెల అత్యుత్తమ పతకాన్ని సాధించారు. వీరి విజయం రాష్ట్ర కీర్తికి ప్రతీక అని సీఎం పేర్కొన్నారు. విజేతలకు ప్రత్యేక నగదు ప్రోత్సాహంతో సత్కరించారు.



ముఖ్యమంత్రి చేతుల మీదుగా నగదు ప్రోత్సాహం అందుకుంటున్న అమరేష్ కుమార్ సాహు



నగదు ప్రోత్సాహం అందుకుంటున్న అఖిల్ గేదెల

అత్యాచార ఘటన నిందితులు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఐజీ చరణ్ సింగ్ మీనా తదితరులు

కొరాపుట్: మైనర్ బాలికపై అత్యాచారం, ఆపై హత్య చేసిన ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు దక్షిణ పశ్చిమాంచల్ డీఐజీ చరణ్ సింగ్ మీనా ప్రకటించారు. మంగళవారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం రోజుల క్రితం తెంతులకుంటి సమితి కొంటాగాం గ్రామంలో పదేళ్ల బాలికని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లి, అత్యాచారం చేసి హత్య చేశారు. ఈ ఘటనకి పాల్పడిన కొంటాగాం గ్రామానికి చెందిన పరమానంద దిసారి, అలేఖ్ మఝిలను అరెస్ట్ చేశామన్నారు. వీరిద్దరూ అత్యాచారం అనంతరం బాలిక తమను గుర్తుపట్టినందున హత్య చేసినట్లు అంగీకరించారని పేర్కొన్నారు. బాలిక కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయడానికి ప్రభుత్వానికి లేఖ రాశామని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్పీ రోహిత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



పట్టుబడిన నిందితులు

కొవ్వొత్తుల ర్యాలీ

బాలికపై అత్యాచారానికి నిరసనగా సోమవారం రాత్రి నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని సదాశివ త్రిపాఠి పార్క్ నుంచి గాంధీ జంక్షన్ వరకు మహిళలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మహిళా హక్కుల పరిరక్షణ సంస్థ మా ఘరో ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. సంస్థ కన్వీనర్ కాదంబనీ త్రిపాఠి, కాంగ్రెస్ నాయకుడు మున్నా త్రిపాఠి, కొరాపుట్ జిల్లా జై భీం నాయకురాలు మనస్విని టక్రి తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

చట్టాలతో బాధితులకు న్యాయం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి బిమల్ రాలో



సమావేశానికి విచ్చేసిన విద్యార్థులు, అధ్యాపకులు

పర్లాకిమిడి: నల్సా చట్టం-2017, పోక్సో చట్టాల వల్ల బాధితులకు కోర్టుల్లో న్యాయం జరుగుతోందని న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ ప్రాధికరణ కార్యదర్శి బిమల్ రాలో అన్నారు. స్థానిక శ్రీకృష్ణచంద్ర గజపతి కళాశాలలో న్యాయ చైతన్య అవగాహన శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనర్ బాలికలపై లైంగిక దాడి కేసుల్లో పోక్సో చట్టం ప్రకారం కనీసం ఆరేళ్ల నుంచి ఏడేళ్ల జైలు శిక్ష, బాధితురాలు చనిపోతే యావజ్జీవ కారాగారము, జరిమానా విధించడం జరుగుతుందన్నారు. మహిళలపై యాసిడ్ పోస్తే నిందితుడికి పదేళ్లు లేదా యావజ్జీవ కారాగారం, పెద్ద మొత్తంలో జరిమానా ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.జితేంద్ర నాథ్ పట్నాయక్, అధ్యాపకుడు ప్రొఫెసర్ ఆర్కే భుయ్యాన్, ఆదర్శ పోలీసుస్టేషన్ ఐఐసీ ప్రశాంత్ భూపతి, క్షయవ్యాధి నిపుణుడు డాక్టర్ రబి నారాయణ దాస్ తదితరులు పాల్గొన్నారు.

అదుపులో నిందితులు

భువనేశ్వర్: రౌర్కెలా బిర్సా ఛక్ సమీపం అటవీ ప్రాంతంలో ఇద్దరు మైనర్ బాలికలపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు ప్రశ్నిస్తున్నారు. వీరికి వ్యతిరేకంగా పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు రౌర్కెలా జోన్ – 2 డీఎస్పీ నిర్మల చంద్ర మహాపాత్రో తెలిపారు. ఈ వ్యవహారంలో మరో నిందితుడిని గాలించేందుకు 2 ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్లు తెలిపారు. ఈ సంఘటనలో 7, 9 ఏళ్ల ఇద్దరు మైనరు బాలికలు సామూహిక అత్యాచారానికి గురయ్యారు. బిర్సా ముండా వీధిలో శనివారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఈ ఇద్దరు బాలికలు మార్కెటుకు వెళ్లిన సమయంలో ఈ అఘాయిత్యానికి బలయ్యారు. వీరిద్దరూ ఒంటరిగా ఉన్నట్లు గుర్తించిన ముగ్గురు యువకులు బలవంతంగా ఆటోలో అటవీ ప్రాంతానికి తీసుకుని పోయి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. చట్ట ప్రకారంగా పీడిత మైనర్ బాలికలకు వైద్య, ఆరోగ్య పరీక్షల కోసం సిఫారసు చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

పికప్ వ్యాన్ ఢీకొని ఒకరు మృతి



సంఘటన స్థలంలో శుకదేవ్ మృతదేహం



పోలీసులు స్వాధీనం చేసుకున్న పికప్ వ్యాన్

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంవీ 66 గ్రామం వద్ద మంగళవారం మధ్యాహ్నం కలిమెల నుంచి మోటు వైపునకు వెళ్తున్న పికప్ వ్యాన్ ఎదురుగా వస్తున్న బైక్‌ను బలంగా ఢీకొంది. దీంతో బైక్‌ను నడుపుతున్న శుకదేవ్(32) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. శుకదేవ్ ఎంవీ 66 గ్రామం నుంచి జాతీయ రహదారిపై ఉన్న పాఠశాల వద్దకు వెళ్తున్నాడు. అదే సమయంలో అతివేగంగా వచ్చిన పికప్ వ్యాన్ ఢీకొంది. దీంతో అతడు సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. పికప్ వ్యాన్ డ్రైవర్ వెంటనే పరారయ్యాడు. సమాచారం మేరకు పోలీసులు వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.

బంగాళాఖాతంలో వాయుగుండం

భువనేశ్వర్: రాష్ట్రానికి ఆనుకొని బంగాళా ఖాతంలో అల్ప పీడనం ఏర్పడినట్లు స్థానిక వాతావరణ కేంద్రం తెలిపింది. అల్ప పీడనం ప్రభావంతో రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో బుధ, గురువారాల్లో 7 నుంచి 11 సెంటీ మీటర్ల వరకు భారీ వర్ష సూచన జారీ చేశారు. ఈ నేపథ్యంలో బాలాసోర్, భద్రక్, కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్, మయూర్‌భంజ్, కెంజొహార్, జాజ్‌పూర్, ఝార్సుగుడ, సంబల‌పూర్, బర్‌గడ్ జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేశారు.

1.27 లక్షల మందికి టీకాలు

● జిల్లా ముఖ్య వైద్యాధికారి డా.లాల్ మోహన్



మాట్లాడుతున్న డాక్టర్ సుబుద్ధి, వేదికపై డాక్టర్ లాల్ మోహన్ తదితరులు

రాయగడ: జిల్లాలో ఈ ఏడాది 1.27 లక్షల మందికి బీసీజీ టీకాలు వేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్ స్పష్టం చేశారు. స్థానిక అర్బన్ పీహెచ్‌సీలో బీసీజీ టీకాల కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షయరోగ నివారణ చర్యలకు జిల్లా వైద్యారోగ్య శాఖ చర్యలు చేపట్టిందన్నారు. దీనిలో భాగంగా జిల్లాస్థాయిలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వివరించారు. ఈ టీకాలను 60 ఏళ్ల వయసు పైబడిన వారికి ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా 18 ఏళ్ల పైబడిన వారు ఇదివరకు ఎటువంటి క్షయరోగ నివారణకు సంబంధించి టీకాలు తీసుకొని వారిని గుర్తించి, టీకాలు వేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. అంటువ్యాధిగా గుర్తింపు పొందిన క్షయరోగ నివారణకు సకాలంలో చికిత్స చేయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఇంటింటా తిరిగి విస్తృత ప్రచారం

బీసీజీ టీకాలు వేసేందుకు ప్రతీ ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్త చురుకైన పాత్రను పోషించాల్సి ఉంటుందన్నారు. దీనిపై వీరికి ఇప్పటికే శిక్షణ అందజేశామని వెల్లడించారు. వీరంతా ప్రతీ గ్రామంలో తిరిగి టీకాలు ఇచ్చేందుకు సన్నద్ధమవుతారన్నారు. ఇంటింటా ప్రచారాన్ని కొనసాగించి ఈ టీకాలు వేసే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య శాఖ ఏడీఎం డాక్టర్ మమత సాహు, డాక్టర్ మమత చౌదరి, డాక్టర్ ప్రదీప్ కుమార్ సుబుద్ధి, అర్బన్ పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ చిన్మయ బెహర తదితరులు పాల్గొన్నారు.

బీఎస్‌ఎఫ్‌ను వెనక్కి పంపకండి



ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

● అభివృద్ధిని ఆపొద్దని గిరిజనుల ర్యాలీ

మల్కన్‌గిరి: బీఎస్‌ఎఫ్ జవాన్లను వెనక్కి పంపవద్దని జిల్లాలోని చిత్రకొండ స్వాభిమాన్ ఏరియా జాంత్రీ పంచాయతీ పరిధి 14 గ్రామాల ప్రజలు కోరారు. ఈ మేరకు పంచాయతీలో గిరిజనులంతా కలిసి మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఎస్‌ఎఫ్ జవాన్లను వెనక్కి పంపడం అంటే అభివృద్ధిని ఆపడమేనని పేర్కొన్నారు. ఒకప్పుడు చిత్రకొండ సమితి మావోయిస్టుల ప్రాబల్యంతో కటాఫ్ ఏరియాగా పిలువబడేదని గుర్తు చేసుకున్నారు. అప్పట్లో ఇక్కడ కనీస సౌకర్యాలు ఉండేవి కావని, జలాశయంలో నాటు పడవల్లో ప్రయాణాలు సాగించేవాళ్లమని పేర్కొన్నారు. అటువంటి ఇబ్బందికర పరిస్థితుల్లో బీఎస్‌ఎఫ్ జవాన్లు వచ్చాక గురుప్రియ వంతెన నిర్మాణం పూర్తయ్యిందని తెలియజేశారు. అనంతరం ఈ ప్రాంతం నుంచి మావోయిస్టులను తరిమేశారని, అప్పటి నుంచి అభివృద్ధి ప్రారంభమైందన్నారు. అనంతరం కటాఫ్ ఏరియాను స్వాభిమాన్ ఏరియాగా మార్చినట్లు ఆనందం వ్యక్తం చేశారు. అయితే ప్రస్తుతం మరలా బీఎస్‌ఎఫ్ జవాన్లను కొంతమందిని వెనక్కి పంపడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారిని మరో ఐదేళ్ల పాటు కొనసాగించాలని కోరుతున్నారు. ర్యాలీలో వందలాది మంది గిరిజనులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఇరువురు ఉపాధ్యాయులకు రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రత్యేకంగా సత్కరించారు. స్థానిక లోక్‌సేవ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన నిరాడంబర కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు డాక్టర్ ద్వితి చంద్ర సాహు, సంతోష్ కుమార్ కొరాలు ముఖ్యమంత్రి సత్కారం అందుకున్నారు. చిత్రకళతో దళిత సంప్రదాయాలపై బాలలను చైతన్యపరిచే దిశలో డాక్టర్ ద్వితి చంద్ర సాహు, బాలలకు సరళమైన రీతిలో వైజ్ఞానిక విషయాల బోధనలో సంతోష్ కుమార్ కొరా విభిన్నత చాటుకుని జాతీయ పురస్కారం సాధించుకోవడం రాష్ట్రానికి గర్వ కారణమని ముఖ్యమంత్రి అభినందించారు.



సత్కారం అందుకుంటున్న ఉపాధ్యాయులు

క్లుప్తంగా

నదిలో మునిగి వృద్ధురాలి మృతి



మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొస్తున్న గ్రామస్తులు

రాయగడ: నదిలో మునిగి ఒక వృద్ధురాలు మృతి చెందిన ఘటన జిల్లాలోని కాసీపూర్ సమితి డొంగాశిలి పంచాయతీలోని జి.పవ్వరా గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. మృతురాలు అదే గ్రామానికి చెందిన చంచలా నాయక్ (56)గా గుర్తించారు. ఎప్పటిలాగే సాయంత్రం చంచల సమీపంలోని నదికి స్నానానికి వెళ్లింది. నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందింది. ఎప్పటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు నది వద్దకు వెళ్లి చూడగా నది బయట ఆమె చెప్పులు ఉండడం గమనించారు. వెంటనే గ్రామంలోని యువకులు నదిలో దిగి గాలించగా కొద్ది దూరంలో చంచల మృతదేహం కనిపించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

ఏనుగు దాడిలో ఇద్దరు మృతి

భువనేశ్వర్: మయూర్‌భంజ్ జిల్లాలో ఏనుగు దాడిలో 2 మంది వ్యక్తులు మృతి చెందారు. జిల్లాలోని బరిపద మొరొడా మండలం సానొపురియా, ఉలిడిహి గ్రామాల్లో ఏనుగు బీభత్సం సృష్టించింది. సానొపురియా గ్రామంలో ఇంటి వరండాపై నిద్రిస్తున్న యువకుడిని ఏనుగు తొక్కేయడంతో మృతి చెందాడు. అలాగే ఉలిడిహి గ్రామంలో మహిళ వాకిలి ఊడ్చుతుండగా అకస్మాతుగా ఏనుగు దాడి చేయడంతో ఘటనా స్థలంలో మహిళ మృతి చెందింది.

గోడ కూలి వృద్ధురాలి మృతి



కూలిపోయిన గోడ

భువనేశ్వర్: కెంజొహర్ జిల్లాలో ఇంటి గోడ కూలి వృద్ధురాలు మృతి చెందింది. హత్తాడిహి తహసిల్ ఒరాలి గ్రామంలో ఈ విషాద సంఘటన చోటు చేసుకుంది. మృతురాలు తరూ జెనాగా గుర్తించారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలం చేరి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రాంతంలో గత కొద్ది రోజులుగా తెరిపి లేకుండా వర్షం కురుస్తున్నందున ఈ విపత్తు సంభవించింది.

సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు



భరత్‌పూర్ ఠాణాలో ఏర్పాటైన సీసీటీవీ కెమెరా

భువనేశ్వర్: వివాదస్పద స్థానిక భరత్‌పూర్ పోలీసు ఠాణాలో సీసీటీవీ కెమెరాలను మంగళవారం ఏర్పాటు చేశారు. ఠాణా లోపల, బయట వేర్వేరు ప్రాంతాల్లో 16 చోట్ల వీటిని ఏర్పాటు చేయడం విశేషం. త్వరలో మరో 9 కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఠాణా అధికార వర్గాలు తెలిపాయి.

కెమెరా దొంగలించిన వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న కెమెరా

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి సోమనాథ్‌పూర్ పంచాయతీ సమీపంలోని అడవిలో అమర్చిన కెమెరాను దొంగలించిన భూదు పూజారి అనే వ్యక్తిని బలిమెల పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 19వ తేదీన సోమనాథ్‌పూర్ గ్రామానికి చెందిన భూదు పూజారి అనే వ్యక్తి అడవికి కర్రలు కోసం వెళ్లాడు. అయితే అడవిలో వన్యప్రాణుల ప్రవర్తన పర్యవేక్షించడం కోసం అటవీ శాఖ అధికారులు చెట్టుపై కెమెరాను అమర్చి ఉంచారు. దానిని చూసిన భూదు ఆ కెమెరాను దొంగలించి ఇంటికి తీసుకొచ్చి తన వద్దనే ఉంచుకున్నాడు. అటవీ శాఖ అధికారులు కెమెరా తీసిన వ్యక్తి కోసం దర్యాప్తు చేస్తున్న సమయంలో, కెమెరా అమ్మేందుకు తిరుగుతున్న భూదు విషయం తెలిసిందే. దీంతో వారు బలిమెల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సోమవారం రాత్రి భూదు ఇంటికి వెళ్లి అతడిని అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరుస్తామని బలిమెల ఐఐసీ సుమన్ పట్నాయక్ తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



ప్రతిభ కనబర్చిన విద్యార్థికి మోమెంటో అందజేస్తున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్



ర్యాలీ ప్రారంభిస్తున్న డీడబ్ల్యూవో మనోరమ దేవి



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, అంగన్‌వాడీలు

పర్లాకిమిడి: గర్భిణులు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. స్థానిక యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి హాల్‌లో పౌష్టికాహార మాసోత్సవాల ముగింపు సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లాలోని 2,443 అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు రోజూ గుడ్డు, చిరుధాన్యాల ఉప్మా, బిస్కెట్లు అందజేస్తున్నామని ఐసీడీఎస్ అధికారి సుజాతారాణి మిశ్రో అన్నారు. అంతుకుముందు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి పోషణ మహోత్సవాల ర్యాలీని జిల్లా సామాజిక సంక్షేమాధికారి మనోరమా దేవి ప్రారంభించారు. ప్లస్ టు, ప్లస్ త్రీ మహిళా కళాశాల విద్యార్థినులకు పోషణ మహోత్సవాలపై నిర్వహించిన వక్తృత్వ, రచనా పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. అలాగే జిల్లాలో ఉత్తమ అంగన్‌వాడీ వర్కర్లను సత్కరించారు. కార్యక్రమంలో మిషన్ శక్తి డైరెక్టర్ టిమోన్ బోరా, జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి మనోరమా దేవి, డీసీపీయూ అరుణ్ కుమార్ త్రిపాఠి, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

• అయ్యో.. బామ్మా..!



ఈ చిత్రంలో కనిపిస్తున్న బామ్మ పేరు పథురి దెహురి. ఈమె వయస్సు దాదాపు 80 ఏళ్లు. వయోభారంతో నడవలేని పరిస్థితి ఆమెది. కానీ ప్రభుత్వం మంజూరు చేసే పింఛన్ డబ్బులే జీవనాధారం. దీంతో రోడ్డుపై పాకుకుంటూనే దాదాపు 2కి.మీ పాటు పింఛన్ డబ్బులు కోసం ప్రయాసలు పడుతూ మంగళవారం పింఛన్ ఇచ్చే ప్రదేశానికి వెళ్లింది. ఈ హృదయ విదారక ఘటన కెంజొహర్ జిల్లా రయిసుంవా గ్రామ పంచాయతీలో చోటుచేసుకుంది. ఇది చూసిన పలువురు ఆమెకు ఇంటి వద్దనే పింఛన్ ఇచ్చే ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నారు. – భువనేశ్వర్

ఈనెల 30న న్యాయ కమిషన్ నోటిఫికేషన్

భువనేశ్వర్: భరత్‌పూర్ పోలీసు ఠాణా సంఘటనపై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య న్యాయ విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఈనెల 30వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుంది. మంగళవారం విచారణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలను (టరమ్స్ ఆఫ్ రిఫరెన్స్) జారీ చేసింది. దీని కోసం నిరీక్షిస్తున్నట్లు న్యాయ విచారణ కమిషన్ అధ్యక్షుడు జస్టిస్ చిత్త రంజన్ దాస్ తెలిపారు. దీని ఆధారంగా విచారణ కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ ఉత్వర్వుల ప్రకారం భువనేశ్వర్ సర్క్యూట్ హౌసు ప్రధాన కార్యాలయంగా విచారణ కమిషను పని చేయాల్సి ఉంటుంది. ఈ సంఘటనకు సంబంధించిన సమాచారం, అభియోగాలు కమిషను దృష్టికి తీసుకొచ్చేందుకు అనుబంధ వర్గాలు అఫిడవిట్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ కోసం ఈ నెల 30న సమగ్ర వివరాలతో ఉత్తర్వులు ప్రచురితం అవుతాయి.

బాహుదా నదిలో వ్యక్తి గల్లంతు



గిరిధారి బన్‌సాల్ (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: బాహుదానదిలో పడి ఇటుకబట్టీ కార్మికుడు గల్లంతయ్యాడు. ఇచ్ఛాపురం మండలం బిర్లంగి ఇటుకబట్టీలో ఒడిశా రాష్ట్రం బొలంగిరి జిల్లా బాడిచూడెన్ గ్రామానికి చెందిన గిరిధారి బన్‌సాల్ (45) కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం స్నేహితులు మోహిత్ లాల్ బెహరా, రోహిత్ మాజి, డంబుగా బారియా, దినేష్ బారియాలతో కలిసి కిరాణ షాపులో సామాన్లు కొని బాహుదానదిలో స్నానం కోసం నదిలో దిగారు. ప్రవాహ ఉధృతికి గిరిధారి బన్‌సాల్ కొట్టుకుపోయాడు. స్థానికుల సహాయంతో నదిలో గాలించినా ప్రయోజనం లేకపోయింది. స్నేహితుడు మోతీలాల్ బెహరా మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ ఈ.శ్రీనివాస్ కేసు నమోదు చేసి గాలింపు చేపడుతున్నారు.

హోంగార్డుల సస్పెన్షన్

శ్రీకాకుళం క్రైమ్ : విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న ఇద్దరు హోంగార్డులను ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి మంగళవారం సస్పెండ్ చేశారు. మరో ఐదుగురిపై నెల రోజుల పాటు సస్పెన్షన్ వేటు వేశారు. గత నెల 21న రూ.5 వేలు లంచం తీసుకున్నాడన్న కారణంతో పాతపట్నం కానిస్టేబుల్ శ్యామలరావును తాత్కాలికంగా సస్పెండ్ చేసిన ఎస్పీ.. ఈ క్రమంలోనే జిల్లా యూనిట్‌లో పనిచేస్తున్న హోంగార్డుల పనితీరును కొద్దిరోజులుగా పరిశీలించి విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్నవారి జాబితాను సిద్ధం చేసుకున్నారు.

వికసిత ఒడిశాకు సన్నాహాలు



సన్నాహక సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: భారతీయ జనతా పార్టీ ఎన్నికల హామీల్లో భాగమైన వికసిత ఒడిశా ఆవిష్కరణ కోసం సన్నాహాలు ప్రారంభం అయ్యాయి. ఒడిశా రాష్ట్ర అవతరణ జరిగి 2036 నాటికి 100 ఏళ్లు పూర్తవుతాయి. దీనిని పురస్కరించుకొని వికసిత్ ఒడిశా ప్రజలకు కానుకగా సమర్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ దీర్ఘకాలిక ప్రణాళిక విజయవంతం చేసే దిశలో సన్నాహాలు షురూ అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా అధ్యక్షతన ఆయన కార్యాలయంలో తొలి స్టీరింగు కమిటీ సమీక్ష సమావేశం జరిగింది. స్వతంత్ర్య భారత దేశం శత జయంతి పురస్కరించుకుని వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా వికసిత్ ఒడిశా ముందస్తుగా సిద్ధం కావాల్సి ఉందన్నారు. సమావేశానికి అభివృద్ధి కమిషనర్ అనూగర్గ్, వికసిత్ ఒడిశా వర్గాల కార్యదర్శులు హాజరయ్యారు.

సమస్యలు పరిష్కరించాలి



నిరసన చేపడుతున్న లోకో పైలట్లు

భువనేశ్వర్: తమ సమస్యలు పరిష్కరించాలని లోకో పైలట్లు డిమాండ్ చేశారు. తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత లోకో రన్నింగ్ సిబ్బంది సంఘం పిలుపు మేరకు ఖుర్దారోడ్ డీఆర్‌ఎం కార్యాలయం ఎదురుగా మంగళవారం నిరసన చేపట్టారు. పైలట్లకు పరిమిత పనివేళలు అమలు చేయాలని కోరారు. విధి నిర్వహణ అనంతరం 16 గంటల విరామంతో పాటు గూడ్సు రైలు పైలట్లకు 8 గంటలు, ప్రయాణికుల రైలు డ్రైవర్లకు 6 గంటల పని వేళలు పరిమితం చేయాలని విన్నవించారు. రన్నింగ్ అలవెన్సు 25 శాతం పెంచి, ఆదాయ పన్ను వడ్డనలో 70 శాతం వరకు మినహాయింపు కల్పించాలని పేర్కొన్నారు. ఈ వర్గపు సిబ్బందికి జీతభత్యాల సవరణ అనివార్యమన్నారు. విధి నిర్వహణ అనుబంధ పరికరాల కోసం ట్రాలీ బ్యాగ్ ప్రతిపాదనని విరమించుకోవాలని నినాదాలు చేశారు.

ఎన్‌ఈపీ అమలుకు సన్నాహాలు



ఉన్నత స్థాయి సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్రంలో జాతీయ విద్యా విధానం(ఎన్‌ఈపీ) అమలు చేసేందుకు ఒడిశా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి రంగంలోకి దిగింది. 2024 – 25 విద్యా సంవత్సరం నుంచి అండర్ గ్రాడ్యుయేట్ విద్యా బోధనలో ఈ విధానానికి అనుకూల రీతిలో పాఠ్యాంశాల రూప కల్పన కోసం విభాగం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి రాష్ట్రంలో అన్ని విశ్వ విద్యాలయాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ అధికారులు పాల్గొన్నారు.

మండలి ఉపాధ్యక్షుడు, ఉన్నత విద్యా విభాగం కమిషనర్, కార్యదర్శి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. జాతీయ విద్యా విధానం అమలు పురస్కరించుకుని కొత్త పాఠ్యాంశాల రూప కల్పనలో సాధకబాధకాలపై ఈ సమావేశంలో లోతుగా చర్చించినట్లు అధికారులు తెలిపారు.

శ్రీమందిరంలో షోల పూజ సన్నాహాలు



గజపతి మహారాజా ప్రాతినిధ్యం స్వీకరించిన రాజ పురోహితులు

భువనేశ్వర్: పూరీ శ్రీ మందిరంలో కొలువై ఉన్న విమలా దేవి పీఠంలో దసరా పురస్కరించుకుని షోల పూజలు నిర్వహించడం ఆచారం. ఈ ఆచారంలో భాగంగా 21 మంది శ్రోతీయ బ్రాహ్మణులకు గజపతి మహారాజా దివ్య సింగ్ దేవ్ స్వాగతించారు. ఈ పూజల్లో ఆయన ప్రాతినిధ్యం ప్రతీకంగా వక్క, టెంకాయని బ్రాహ్మణోత్తములకు అందజేశారు. వీరంతా షోడశ దినాత్మక పూజల్ని షోడశోపచారాలతో అత్యంత నియమ నిష్టలతో ఆచరిస్తారు. మూల అష్టమి నుంచి ఈ పూజల్ని ప్రారంభిస్తారు. రాష్ట్రం అంతటా ప్రముఖ శక్తి పీఠాల్లో షోడశ దిన్మాతక పూజోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సిద్ధం అయ్యారు.

• రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఉద్యోగి



రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్ తదితరులు



రాయగడ: రక్తదాన శిబిరంలో పాల్గొన్న అతిథులు

పర్లాకిమిడి: స్థానిక బిజూ కల్యాణ మండపంలో జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి మంగళవారం ప్రారంభించారు. రక్తదానం వల్ల అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులకు మేలు జరుగుతుందన్నారు. శిబిరంలో 72 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో ఏడీఎం రాజేంద్ర మింజ్, సబ్ కలెక్టర్ అనుప్ పండా, జిల్లా పరిషత్ అదనపు సీడీఎం పృథ్వీరాజ్ మండల్, జిల్లా చికిత్సా అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ పండా తదితరులు పాల్గొన్నారు.

రాయగడ: జాతీయ సేవ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్న గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (జీఐఈటీ) విశ్వవిద్యాలయంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరంలో 602 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. బీడీవో సుబ్రాంజలి ప్రధాన్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో రిజిస్ట్రార్ ఎన్‌వీ జగన్నాథరావు, విశ్వవిద్యాలయం కులపతి డాక్టర్ ఏవీఎస్‌ఎల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

భారీగా గంజాయి స్వాధీనం



పోలీసులకు పట్టుబడిన నిందితుడు



బొలేరోలో పట్టుబడిన గంజాయి బస్తాలు

రాయగడ: పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు బొలేరోలో అక్రమంగా తరలిస్తున్న 525 కిలోల గంజాయిని గుణుపూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి గజపతి జిల్లాకు చెందిన జీతు నాయక్ అనే వ్యక్తిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. గుణుపూర్ ఆదర్శ పోలీస్ స్టేషన్ ఎస్‌డీపీవో బబులా నాయక్ ఈ మేరకు మంగళవారం కేసు వివరాలను పత్రికలకు విడుదల చేశారు. గుణుపూర్ ఆర్‌ఎంసీ కూడలిలో సోమవారం సాయంత్రం వాహన తనిఖీలను నిర్వహిస్తున్న పోలీసులు గజపతి జిల్లా నుంచి వస్తున్న ఒక బొలేరోను ఆపి తనిఖీ చేయగా, అందులో 15 బస్తాల గంజాయి పట్టుబడింది. బొలేరోను సీజ్ చేసిన పోలీసులు నిందితుడి నుంచి రూ.150 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.



మంటల్లో చిక్కుకున్న ట్రక్కు

మంటల్లో చిక్కుకున్న ట్రక్కు

భువనేశ్వర్: కందిపప్పు లోడుతో జాతీయ రహదారిపై దూసుకుపోతున్న ట్రక్కు ఆకస్మికంగా మంటల్లో చిక్కుకుంది. కటక్ జిల్లా ఫులొనాఖొరా పోలీసు ఠాణా 60వ నంబర్ రాష్ట్ర జాతీయ రహదారి ఒడొష్ పూర్ – నియాలీ ఒమొణొకుదొ గ్రామం మార్గం రహదారిపై మంగళవారం వేకువ జామున ఈ ఘటన చోటు చేసుకుంది. అదృష్టవశాత్తు డ్రైవర్ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. రాయ్‌పూర్ నుంచి కోణార్కు ప్రాంతానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ వాహనంలో 30 టన్నుల కంది పప్పు రవాణా అవుతున్నట్లు డ్రైవర్ తెలిపాడు. సమాచారం అందడంతో స్థానిక అగ్నిమాపక దళం ఘటన స్థలానికి చేరుకొని మంటలను 3 గంటలు శ్రమించి అదుపులోకి తీసుకొచ్చారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన బదిలీ అధికారులు



బదిలీపై వెళ్తున్న అధికారులతో కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో వివిధ హోదాల్లో పనిచేస్తూ ఇతర జిల్లాలకు బదిలీ అయిన పలువురు జిల్లా స్థాయి అధికారులు కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్‌ను కలెక్టరేట్‌లో మంగళవారం కలిశారు. వారందరినీ కలెక్టర్ అభినందిస్తూ జిల్లాలో వారు అందించిన సేవలను ప్రశంసించారు. ఆయా జిల్లాల్లో నియమించిన స్థానాల్లో సమర్థులైన అధికారులుగా పేరు తెచ్చుకోవాలని అభిలషించారు.

మహిళా గర్జన పోస్టర్ ఆవిష్కరించిన ఎస్పీ



మహిళాగర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం: సమాజంలో మహిళలు, చిన్నారులపై పెరిగిపోతున్న దాడులను ప్రతిఘటించేందుకు, ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు వాజీ చానల్, మహిళా గర్జన కమిటీ ఈ నెల 30వ తేదీన ఉదయం 9 గంటలకు మహిళా గర్జన అనే పేరుతో కోట జంక్షన్ వద్ద బృహత్తర కార్యక్రమం చేపట్టనున్నాయి. ఈ కార్యక్రమంలో విజయవంతం కావాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆకాంక్షిస్తూ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కోట వద్ద జరిగే కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని, ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా భావించాలని వాజీ చానల్ పిలుపునిచ్చింది. కార్యక్రమంలో చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ గోటేటి హిమబిందు, గురుప్ర సాద్ తదితరులు పాల్గొన్నారు.

1324 లీటర్ల సారా పారబోత

సీతంపేట: మండలంలోని సీతంపేట, దోనుబాయి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 36 కేసుల్లో సీజ్‌చేసిన 1324.75 లీటర్ల సారాను పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు పర్యవేక్షణలో పారబోసినట్లు ఎస్సై జగదీష్‌నాయుడు మంగళవారం తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు అక్రమంగా రవాణా చేసిన కేసుల్లో పట్టుకున్న సారా నిర్వీర్యమైనట్లు చెప్పారు.

పోలీసుల అదుపులో ఏడుగురు పేకాట రాయళ్లు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి రహదారిలో ఉన్న టిడ్కో కాలనీ సమీపంలో పేకాట స్థావరంపై స్థానిక పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేపట్టగా పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని ఎస్సై గణేష్ తెలిపారు. వారి నుంచి రూ.25,060 నగదు, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం కోర్టుకు అప్పగించామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బాలికలకు అస్వస్థత



ఎస్‌కోట ఏరియా ఆస్పత్రిలో విద్యార్థినులను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కర రావు

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ బాలికల సంక్షేమ వసతి గృహంలో విద్యార్థినులు సోమవారం రాత్రి అస్వస్థతకు గురయ్యారు. ఆరుగురు విద్యార్థినులు వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతున్నారన్న సమాచారం అందుకున్న స్థానిక హెల్త్ అసిస్టెంట్ శంకరరావు మంగళవారం ఉదయం హుటాహుటిన వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తన బైక్‌పై తీసుకెళ్లి జాయిన్ చేసి, ప్రాథమిక వైద్యం చేయించి. విషయాన్ని కొట్టాం వైద్యాధికారులకు తెలిపారు. దీంతో అప్రమత్తమైన సిబ్బంది హాస్టల్‌లో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు ఎస్.కోట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించి వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. వైద్యులకు తగిన సూచనలు ఇచ్చారు. వారం రోజుల పాటు నిత్యం హాస్టల్ విద్యార్థులపై ఆరోగ్యంపై తగిన శ్రద్ధ చూపాలని కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారికి ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో కొట్టాం పీహెచ్‌సీ, ఎస్‌కోట ఏరియా ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

విజయనగరం అర్బన్: నెల్లిమర్ల మండలం తంగుడుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరపున సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.10 వేలు విరాళాన్ని అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కును కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు మంగళవారం అందజేశారు. వారిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జేసీ ఎస్.సేతుమాధవన్, డీఈఓ ఎన్.ప్రేమకుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కదం తొక్కిన గిరిజన రైతులు

- బడిదేవరకొండ లీజులు రద్దు చేయాలి
- గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలి
- కలెక్టరేట్ వద్ద ఆందోళన



కలెక్టరేట్ దగ్గర ఆందోళన చేస్తున్న నాయకులు, గిరిజనులు

పార్వతీపురం: గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు రెవెన్యూ పట్టాలు మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణ మూర్తి అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో తాన్నవలస, వెలగవలస, దోనిగెడ్డవలస, చందివలస, గంగాపురం, తొక్కుడు వలస, సీతంపేట, పనసభద్ర, నక్షంద్రవలస తదితర గ్రామాలకు చెందిన గిరిజనులతో ఆందోళన నిర్వహించారు. ఆందోళన చేసిన ప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో కలెక్టరేట్ ఎదుటే బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017లో బడిదేవర కొండకు గ్రానైట్ తవ్వకాల కోసం అప్పటి ప్రభుత్వం అనుమతులను జారీ చేసిందన్నారు. ఆ ప్రాంతం కొండ రిజర్వ్ ఫారెస్టులో ఉందని దాని అనుమతులను రద్దు చేసినట్లు ఫారెస్టు అధికారులు పేర్కొన్నార న్నా రు. అయితే అప్పటికే గిరిజనులకు ఆ ప్రాంతంలో కొండపై సాగు చేస్తున్న భూములకు సుమారు 2,500 మందికి పోడు పట్టాలు కూడా అందజేశారని, వారికి రైతు భరోసా తదితర పథకాలను కూడా గత ప్రభుత్వం అందించిందన్నారు. గిరిజనులకు మంజూరు చేసిన పట్టాలను రద్దుచేయడం సరైనది కాదని, గతంలో ఇచ్చిన పట్టాల స్థానంలో అటవీశాఖ పట్టాలుగా మార్చి గిరిజనులకు అందజేయాలని డిమాండ్ చేశారు.

గిరిజనానికి అన్యాయం సరికాదు

ప్రభుత్వాలు కార్పొరేట్ వర్గాలతో కుమ్మక్కై కొండ తవ్వకాలకు అనుగుణంగా సర్వే రికార్డులను తారుమారు చేసి గిరిజనులకు అన్యాయం చేయడం సరైనది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పట్టాలను పునరుద్ధరించడంతోపాటు ఈప్రాంత ఆరాధ్య దైవంగా భావించే బడిదేవర కొండ లీజులైసెన్స్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి. కేశవనాయుడికి అందజేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి సమస్య పరిష్కారిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు బంటు దాసు, సీఐటీయూ నాయకుడు బి.సూరిబాబు, గిరిజన సంఘ నాయకులు పి.రాము, ఎస్.చిరంజీవి, ఎం.బాషాతో పాటు వందలాది మంది గిరిజనులు పాల్గొన్నారు.

ఫారెస్టు ఆఫీస్ వద్ద ధర్నా

పార్వతీపురం టౌన్: బడిదేవరకొండ రిజర్వ్ ఫారెస్టుగా నమోదై ఉన్నప్పటికీ మైనింగ్ అనమతులు ఏ విధంగా ఇస్తారని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణ మూర్తి అధికారులను నిలదీశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఆధ్వర్యంలో పార్వతీపురం పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఫారెస్టు ఆఫీస్ వద్ద ధర్నాకు దిగారు. అనంతరం కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.



ర్యాలీలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు, గిరిజనులు

వైర్‌లెస్ సెట్‌లోనే విన్నపాలు

- ఎస్పీ వకుల్ జిందాల్



వైర్‌లెస్ సెట్ ద్వారా సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్పీ వకుల్ జిందాల్ వినూత్న కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. ఎన్నో వ్యయప్రయాసలతో జిల్లా కేంద్రానికి వచ్చి, పోలీసు కార్యాలయంలో తమ సమస్యలను విన్నవించుకుని, వాటి పరిష్కారానికి వేచి చూసే పరిస్థితులకు ఎస్పీ స్వస్తి పలికారు. పోలీస్ సిబ్బంది సమస్యలను సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారి ద్వారా విన్నవించాలని సూచించారు. ఇదే అవకాశంగా భావించిన పోలీసు సిబ్బంది తమ సమస్యలను ఒక్కొక్కటిగా సంబంధిత పోలీసు అధికారి ద్వారా జిల్లా పోలీసు కార్యాలయానికి విన్నవించారు. వాటిని పరిశీలించిన ఎస్పీ ఆ సమస్యలను పరిష్కరించడంలో భాగంగా సిబ్బందిని జిల్లా కేంద్రానికి రాకుండా వారి పోలీసు స్టేషన్‌లోనే వైర్‌లెస్ సెట్ వద్ద హాజరై ఉండాలని సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయం అధికారులు, సిబ్బందిని తన కార్యాలయానికి ఎస్పీ పిలిచి, వివిధ పోలీస్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి సంబంధిత పోలీసు సిబ్బంది, జిల్లా పోలీసు కార్యాలయం ఉద్యోగులతో వైర్‌లెస్ సెట్‌లోనే పరిష్కారానికి చర్యలు చేపట్టారు. సమస్య పరిష్కారానికి ఇంకా ఎంత సమయం పడుతుందో తెలిపి, వారి విన్నపం ప్రస్తుత స్థితిని ఎస్పీ సమక్షంలోనే వివరించారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ ఏవీ.లీలారావు, డీపీఓ ఏఓ ఇన్చార్జ్ సీఐ ఈ.నరసింహమూర్తి, కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, జిల్లా పోలీసు కార్యాలయం పర్యవేక్షకులు ప్రభాకర రావు, వెంకటలక్ష్మి, జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నూతన మద్యం విధానంతో పొట్టకొట్టొద్దు



అసిస్టెంట్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

నెల్లిమర్ల: నూతన మద్యం విధానంతో తమ పొట్టకొట్టొద్దని వైన్‌షాపుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వైన్‌షాపుల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్, సెక్యూరిటీ ఉద్యోగులు స్థానిక ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ గొడౌన్ వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం నూతన మద్యం విధానం తీసుకొచ్చిన దృష్ట్యా తమకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అసిస్టెంట్ మేనేజర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, నెల్లిమర్ల ఎస్సై గణేష్, సిబ్బంది గొడౌన్‌వద్ద బందోబస్తు నిర్వహించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు

బొబ్బిలిరూరల్: మండలంలోని పెంట గ్రామం వద్ద వేగావతి నదిలోని ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఈ మేరకు సీఐ సతీష్‌కుమార్ మంగళవారం తెలిపారు. బూర్జివలస గ్రామ సమీపంలో ఎస్సై రమేష్, సిబ్బంది ఇసుక ట్రాక్టర్లను గుర్తించి పట్టుకున్నారని అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తవ్వి రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదుచేశామని చెప్పారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి



నవీన్‌కుమార్ మృతదేహం

చీపురుపల్లిరూరల్(గరివిడి): చీపురుపల్లి-గరివిడి ప్రధాన రహదారిలో ఆదర్శ డిగ్రీ కళాశాల సమీపంలో టీటైమ్ షాపు దగ్గర మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెడ్డి నవీన్‌కుమార్ (31) మృతి చెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించి మృతుని తల్లి కస్తూరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై బి.లోకేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరివిడి మండలం కొండలక్ష్మీపురం గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ ఉదయం 9గంటల సమయంలో ఇంటిసామగ్రి కొనుగోలు నిమిత్తం ద్విచక్రవాహనంపై గరివిడి వెళ్తున్నాడు. అదే సమయంలో విజయనగరం నుంచి గరివిడి మీదుగా చీపురుపల్లి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు టీ టైమ్ షాపు దగ్గరలో ఆ యువకుడిని ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయం కాగా స్థానికులు చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించడంతో వైద్యులు ప్రథమ చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి..

గజపతినగరం: మండలంలోని దావాల పేట రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ విషయాన్ని రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు తెలియజేస్తూ 30సంవత్సరాలు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి ట్రైన్ నుంచి జారిపడి తీవ్రగాయాలపాలై మృతి చెంది ఉండవచ్చన్నారు. మృతుడి శరీరంపై నలుపు రంగు హాఫ్ ప్యాంట్, పింక్ కలర్ షర్ట్ ఉన్నాయని ఆచూకీ తెలిసిన ఎడల ఫోన్ 9491813163, 94906 17089,8309901038 నంబర్లను సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని విజయనగరంలోని గవర్నమెంట్ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నేలబావిలో పడి వృద్ధుడు..



నేలబావిలో పడి మృతిచెందిన తాతబాబు.

రేగిడి: మండల పరిధిలోని జోడుబందల గ్రామానికి చెందిన బొత్స తాతబాబు (75) నేలబావిలో పడి మంగళవారం మృతిచెందాడు. ఈ ఘటనపై ఎస్సై పి.నీలావతి అందించిన వివరాల ప్రకారం తాతబాబుకు మద్యం తాగే అలవాటు ఉంది. మద్యంమత్తులో ఊరి పక్కనే ఉన్న పొలంవైపు వెళ్తున్న సమయంలో గమనించక నేలబావిలో పడిపోయాడు. కుటుంబసభ్యులు ఈ సమాచారం తెలుసుకుని వెళ్లి చూసి మృతిచెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్య గీత, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

తప్పిన ముప్పు



సంఘటన స్థలంలో లారీ

దత్తిరాజేరు: మండలంలోని దత్తి రోడ్డు కూడలి సమీపంలో దత్తిరాజేరు ఇండియన్ గ్యాస్ గొడౌన్ నుంచి ఖాళీ గ్యాస్ సిలిండర్లను తీసుకెళ్తున్న లారీ అదుపుతప్పి మంగళవారం చింత చెట్టును ఢీకొట్టింది. ఆ సమయంలో అటుగా వాహన చోదకులు కానీ బాటసారులు, మిల్లులో పనిచేసే కూలీలు అటువైపు వెళ్లక పోవడంతో పెద్దముప్పు తప్పింది. లారీలో ఉన్న ఖాళీ సిలిండర్‌లు చెల్లాచెదురు కావడంతో స్థానికులు అక్కడికి చేరుకుని వాటిని తీసి లారీలో వేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పెదనాపురం పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

24.66 కేజీల గంజాయి పట్టివేత



పట్టుకున్న నిందితుడు, గంజాయితో పోలీసులు

సాలూరు రూరల్: మండలంలోని జీగిరాం గ్రామం వద్ద మంగళవారం ఉదయం 24.66 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. ఒడిశా నుంచి సాలూరు వైపు వస్తున్న రెండు ద్విచక్రవాహనాలపై ఇద్దరు నిందితులు అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో గంగరాజ్‌పూర్ గ్రామం పొట్టంగి బ్లాక్ ఒడిశాకి చెందిన సుశాంత్ బంకాను అదుపులోకి తీసుకున్నామని, మరో నిందితుడు పారిపోగా రెండు స్కూటీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.

ఇలా చేయొచ్చా...



పెట్రోల్ బంకు దగ్గర సెల్‌ఫోన్ మాట్లాడడం ప్రమాదం. పెట్రోల్ వేసేటప్పుడు ఇది మరింత ప్రమాదం. ఈ విషయం తెలిసినా కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గంట్యాడ మండలం కొటారుబిల్లి వద్ద ఓ పెట్రోల్ బంకులో ఓ యువకుడు ఇలా బైక్‌లో పెట్రోల్ వేసే సమయంలో మంగళవారం ఫోన్ మాట్లాడుతూ ఇలా కనిపించాడు. ఒకరి చేసే చిన్న పొరపాటుకు ఏదైనా జరగరానిది జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారు...ప్లీజ్...ఒక్కసారి ఆలోచించండి... ప్రమాదాన్ని కొనితెచ్చుకోకండి.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

పైడితల్లమ్మ జాతరకు మౌలిక సదుపాయాలు

- కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య
- నగరంలో క్షేత్ర స్థాయి పర్యటన



అమ్మవారి జాతర ఏర్పాట్లపై ఇంజినీరింగ్ అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: వచ్చే నెల 14,15 తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను జాతర మహోత్సవానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య పేర్కొన్నారు. సిరిమానోత్సవంలో ప్రధాన ఘట్టమైన సిరిమాను తరలింపు ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకట్రావు, పైడితల్లమ్మ దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డీవీవీ ప్రసాదరావు, విజయనగరం కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సిరిమాను తరలించే ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు పరిశీలన చేపట్టారు. జమ్ము ప్రాంతం నుంచి రింగ్‌రోడ్, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, బాలాజీ జంక్షన్, ఆర్‌టీసీ కాంప్లెక్స్, వనంగుడి, ఎన్ సీఎస్, గంటస్తంభం, చదురుగుడి, మీదుగా హుకుంపేట వరకు ఆయన పర్యటించి ఆయా ప్రాంతాలలో గుంతలను పరిశీలించారు. అక్కడక్కడ చిన్నచిన్న గుంతలు ఉన్నట్లు గుర్తించి వెంటనే వాటిని పూడ్చాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సిరిమాను తరలించే సమయంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. పుచ్చలవీధి జంక్షన్ నుంచి ఏర్పాటు చేయనున్న బీటీ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. ఈ పర్యటనలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఈఈ కే శ్రీనివాసరావు, డీఈలు,ఏఈలు పాల్గొన్నారు.

27న జాబ్‌మేళా

రాజాం సిటీ: ఏపీఎస్ఎస్‌డీసీ (ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 27న జాబ్ మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ బి.భాస్కరరావు, స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఎస్.గోవిందరావులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు హెటిరో డ్రగ్స్, ఇన్నోవా సోర్స్, భారత్ ఫైనాన్స్ ఇంక్లుసన్ లిమిటెడ్‌లు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయని పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణత పొంది 18 నుంచి 30 సంవత్సరాల లోపు నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఇంటర్వ్యూలకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన యువత www.apssdc.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదుచేసుకుని దాని రిఫరెన్స్ నంబర్‌తో పాటు రెజ్యూమ్, ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, ఒక పాస్‌పోర్టు సైజు ఫొటోతో ఉదయం 9గంటలకు ఐటీఐలో జరగనున్న జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 7286042743, 9988853335 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

చోరీ సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ సురాన అంకిత మహవీర్

పార్వతీపురం టౌన్: మాయమాటలతో మేనత్తను మోసం చేసి బంగారం దోచుకున్న నిందితుడిని పోలీసులు పట్టుకుని సొత్తు రికవరీ చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించిన ఏఎస్పీ సురాన అంకిత మహవీర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం పెద బొండపల్లి గ్రామానికి చెందిన మణెమ్మ ఇంటికి రాజమండ్రికి చెందిన ఆమె మేనల్లుడు కె.లక్ష్మణరావు జూలై 26న వచ్చాడు. మణెమ్మ కుమార్తెకు వివాహం కుదుర్చుతానని ఆమెకు మాయమాటలు చెప్పాడు. జూలై 27 ఉదయం 5 గంటల సమయంలో మణెమ్మ ఇంట్లో గల బీరువాలోని 16.5 తులాల బంగారం చోరీ చేసి పారిపోయాడు. ఈ నెల 18న బాధితుల పిర్యాధు మేరకు పార్వతీపురం రూరల్ సీఐ గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీ చేసిన బంగారాన్ని అమ్మేందుకు లక్ష్మణరావు పార్వతీపురం పట్టణానికి మంగళవారం వస్తుండగా నర్సిపురం గ్రామ సమీపంలో సీఐతో పాటు ఎస్సై దినకర్, రూరల్ పోలీసులు, సీసీఎస్ సిబ్బంది వలవన్ని పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన రూరల్ సీఐ, ఎస్సై, సిబ్బంది, సీసీఎస్ టీమ్‌ను ఏఎస్పీ సురాన అంకిత్ మహవీర్ అభినందించారు.

రెండో రోజూ స్కూల్‌గేమ్స్‌కు స్పందన

- అండర్-17 విభాగంలో 500 మంది హాజరు
- నేడు అండర్-14, 17 విభాగాల్లో అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక



అండర్ 17 విభాగంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: పాఠశాలస్థాయి విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు నియోజకవర్గస్థాయిలో నిర్వహిస్తున్న స్కూల్‌గేమ్స్‌కు స్పందన లభిస్తోంది. నగర శివారుల్లో గల విజ్జి స్టేడియంలో రెండవ రోజు మంగళవారం అండర్ 17 విభాగంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు 500 మందికి పైగా క్రీడాకారులు వివిధ పాఠశాలల నుంచి హాజరయ్యారు. వారికి మొత్తం ఆరు విభాగాల్లో ఎందుకు పోటీలు నిర్వహించి మొత్తం 18 మంది క్రీడాకారులకు జిల్లా స్థాయిలో జరగనున్న ఎంపిక పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గం ప్రతినిధి కె.తౌడు బాబు తెలిపారు. అదేవిధంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి అండర్ 14, 17 విభాగాల్లో బాల బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో నియోజకవర్గస్థాయిలో అర్హత ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనవచ్చని సూచించారు.

రైళ్లలో దొంగతనాలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ



విజయనగరం జీఆర్‌పీ స్టేషన్‌లో సిబ్బందికి సూచనలు చేస్తున్న లైన్స్ ఇన్‌స్పెక్టర్ అడబాల రవికుమార్

- విశాఖ రైల్వే లైన్స్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్

విజయనగరం క్రైమ్: రైళ్లలో దొంగతనాలు జరగకుండా సిబ్బంది విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని, అనుమానితులను వెంటనే విచారించాలని విశాఖ రైల్వే ఇన్‌స్పెక్టర్ అడబాల రవికుమార్ సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. విశాఖ రైల్వే లైన్స్ ఇన్‌స్పెక్టర్‌గా కొత్తగా నియమితులైన ఆయన మంగళవారం విజయనగరం గవర్నమెంట్ రైల్వే పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు సంబంధించిన విషయాలు, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిషేధిత గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచి, తనిఖీలు ముమ్మరంగా నిర్వహించాలని సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. రైళ్లలో ప్రత్యేక బీట్‌లలో విధులు నిర్వహించేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై బాలాజీరావు, సిబ్బంది పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇచ్చి దోపిడీ

- నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: తన బైక్‌పై లిఫ్ట్ ఇస్తానని చెప్పి కొంతదూరం తీసుకువెళ్లి రూ.50వేలు నగదును దౌర్జన్యంగా లాక్కుని పరారైన నిందితుడిని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ అందించిన వివరాలిలా ఉన్నాయి. పూసపాటిరేగ మండలంలోని కొవ్వాడ గ్రామానికి చెందిన నక్కన లక్ష్మణరావు తన కుటుంబసభ్యుల ఎల్ఐసి బాండ్స్ రెన్యువల్ కోసం ఈ నెల 13న విజయనగరం ఎల్ఐసీ కార్యాలయానికి వచ్చాడు. అక్కడ టెక్నికల్ సమస్య ఉండడంతో ఆ డబ్బులు కట్టకుండా ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతంలో ఉన్న వైన్‌షాప్ వద్దకు వచ్చి మద్యం తాగాడు. అది గమనించిన నిందితుడు తన స్కూటీపై లిఫ్ట్ ఇస్తానని బైక్ ఎక్కించి సీఎంఆర్ మాల్ వైపు తీసుకువెళ్లి, లక్ష్మణ రావు వద్ద ఉన్న రూ. 50వేల నగదును దౌర్జన్యంగా లాక్కుని పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు టెక్నికల్ సపోర్ట్‌తో నిందితుడ్ని గుర్తించారు. పద్మావతినగర్ వద్ద వాహనాల తనిఖీ చేస్తున్నప్పుడు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం, అల్లినగరానికి చెందిన నిందితుడు బసవ కనకరాజును అదుపులోకి తీసుకుని విచారణ చేసి రూ.38,500 నగదు, ఎల్ఐసీ బాండ్ రిసిప్ట్స్, స్నాచింగ్‌కు ఉపయోగించిన యమహా బైక్‌ను సీజ్ చేశారు. నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు.